ముగ్గురు ముద్దాయిలు

ఎమ్. వి. వి. సత్యనారాయణ

"లాక్! హాలో లాక్!" అరిచాడు డిటెక్టివ్ బాండ్.

"వస్తున్నా.... అరవక బాండ్!"

"ఎక్కడున్నావోయ్! అర్జెంట్. పుస్తకం ఒకటి రిఫరెన్స్ కావలసి వచ్చింది."

బాండ్ నిచ్చెన సీటుమీద కూలబడ్డాడు.

నిచ్చెన చుట్టూ ఎత్తయిన యినుపబీరువాలున్నాయి. బీరువాలో పుస్తకాలు వరుసగా అమర్చి వున్నాయి. బాండ్ చెయ్యి చాపాడు. పుస్తకం అందీ అందకుండా తగులుతోంది. రెండు మెట్లు దిగాడు. వూఁహూ! లాభం లేకపోయింది. మరల మెట్లు యెక్కి నిచ్చెన సీటుమీద కూర్చున్నాడు.

"బాండ్!" గుమ్మంలోంచే పిలుచుకుంటూ వచ్చాడు లాక్.

బాండ్ అతడిని ఆశ్చర్యంగా చూశాడు. లాక్ ఒంటిన టర్కిష్ టవల్ తప్ప ఏమీ లేదు. అతడి ఒంటిన

మంచినీటి బిందువులు ముత్యాల్లా మెరుస్తోన్నాయి.

"ఏం కావాలి బాండ్?" అడిగాడు లాక్.

"జలకాలాటల్లో మునిగితే నీకు లోకం తెలియదల్లే వుంది. ఎవడో వచ్చి నన్ను పిస్టోలుతో కాల్చి చంపేసినా సరే నువు యింత ధీమాగా వస్తావు!"

"నిన్ను చంపేవాడు ఎవడు బాండ్?"

"ఏం? నువు పరిశోధిస్తావా?"

లాక్ పకపక నవ్వి, నిచ్చెన ఎక్కాడు. "ఇంతకు నీకు ఏం పుస్తకం కావాలి బాండ్?" అన్నాడు. రెండో వైపు మెట్లమీద నిలబడి వున్నాడు.

"గోల్డు ఫింగర్."

"ఎందుకు?"

"గోల్డు ఫింగర్ గాల్ఫ ఆడుతోండగా బాండ్ 007 మాట్లాడిన కొన్ని సంభాషణలు అవసరమయాయి."

"అవే ఎందుకట?"

"నాన్సెన్స్..." బాండ్ నోరు టక్కున మూతపడింది. పోర్టికోలో రోల్స్‌రాయిస్ కారు ఆగింది. వెంటిలేటర్ లోంచి కారు కనిపిస్తోంది. ఎవరో తలుపు తెరచుకుని దిగారు.

"లాక్! త్వరగా దుస్తులతో దూరు. ఎవరో పార్టీ వస్తోన్నారు."

"పార్టీయా?" నోరు చప్పరించాడు లాక్.

బాండ్ హుందాగా మెట్లు దిగాడు.

గుమ్మంలో ఎత్తుమడమల జోళ్ళు శబ్దం చేశాయి.

లాక్ టవల్ సవరించుకోబోయాడు. బాండ్ అతడిని డొక్కలో గుచ్చాడు.

"లోపలికిపో. బట్టల్లో తగలబడు! రాకరాక పార్టీ

వస్తోంది!" గుసగుసలాడాడు బాండ్. లాక్ గదిలోకి తారాజువ్వలా పరుగెత్తాడు.

"నమస్తే మిస్టర్ బాండ్!" వీణ మీటినట్టయింది.

బాండ్ చకచక గుమ్మంలోకి నడిచాడు. కన్ను ఆర్పకుండా ఆమెనే చూడసాగాడు.

ఆమెకు పాతికేళ్ళుంటాయి. చక్కటి కనుముక్కుతోనూ, అవయవ సంపదా, బంగారు తీగలాంటి శరీరానికి అతుక్కుపోయిన బ్లవుజూ, మాచింగ్ అయ్యేలాగా బెనారస్ కాటన్ చీరా, మెడలో ముత్యాల హారమూ, చెవులకు స్టార్స్, ఎత్తుమడమల జోళ్ళూ, చేతికి వ్రేలాడుతూ వానిటీ బాగ్....అన్నింటికీ తోడు ఆమె పెదిమలమీద మందహాసం వుంది.

"నమస్తే...." హుందాగా చెయ్యి ఎత్తాడు బాండ్.

"ఏమిటలా చూస్తున్నారు?" అడిగింది ఆమె.

"ఇంత అందగత్తెకు పేరేమై వుంటుందా అని!" వానిటీ బాగ్ మీద దృష్టి నిలిపాడు బాండ్.

"అక్కడ నా పేరు వుండదులెండి మిస్టర్ బాండ్!"

"ఎస్. అక్కడలేదు."

"వూఁ! గడుసువారే!"

"అవును.... నేనూ అంతే!"

ఆమె, బాండ్ వులిక్కిపడి ప్రక్కకు చూశారు. లాక్! బాండ్ అతడిని నమిలి తినేసేలాగా చూశాడు. సూటువైపు చూచి నుదురు చిట్లించాడు.

"నా సూటు తగిలించావేం?" అడగబోయాడు బాండ్.

లాక్ అతడికి ఆ అవకాశం యివ్వదలచుకోలేదు.

"బాండ్! ఆమెను నిలబెట్టేశావు. మిస్ సుందరీ!

లోపలకు రండి. కూర్చోండి!" అన్నాడు లాక్ వినయంగా వంగి.

"ఎయిర్ యిండియా మహారాజ్!" నవ్వింది ఆమె.

"కాదు మిస్ సుందరీ! నా పేరు షెర్లాక్ హోంస్. ఈ జేమ్స్‌బాండ్ ముద్దుగా 'లాక్' అంటాడు. డిటెక్టివ్ లాక్!"

బాండ్ అతడి భుజం తట్టి కోపంగా అదిమి, "రండి మిస్...." అని దారితీశాడు.

"సుందరి!" అంది ఆమె.

"మీ పేరు నిజంగా సుందరేనా?" అడిగాడు బాండ్.

ఆమె నవ్వి వూరుకుంది. లాక్ డ్రాయింగ్ రూంలోకి దారితీశాడు.

ముగ్గురూ ఎదురెదురు కుర్చీలలో కూర్చున్నారు. ముగ్గురి మధ్యలో రౌండ్ టీపాయ్ వుంది.

"నేను ఒక కేసు విషయమై మీ వద్దకు వచ్చాను" అంది ఆమె.

"చెప్పండి మాడం!" అన్నాడు బాండ్ కుర్చీలో వెనక్కి వాలి.

లాక్ కళ్ళు మూసుకుని తదేకంగా వింటున్నాడు.

"నా దగ్గర దొంగనోట్లున్నాయి."

బాండ్ కళ్ళు చికిలించాడు. "వుండవచ్చు. అసలు మన దగ్గరకు వచ్చేవి అసలు నోట్లా, దొంగ నోట్లా అని నాకూ ఓ అనుమానం వుంది" అన్నాడు.

"కరెక్ట్! నా పర్సులోకి దొంగనోట్లు ఎలా వచ్చాయో తెలీదు."

"ఎప్పుడు వచ్చాయి?"

"నిన్న సాయంకాలం మార్కెటింగ్‌కి బయలుదేరాను. చీరలు బేరంచేసి పర్స్ తెరిచాను. వంద రూపాయలనోట్లు బయటకు తీశాను. ఒక నోటుమీద నా చూపు పడింది" ఆమె వానిటీ బాగ్ తెరిచింది.

ఆమె బాండ్‌కి వందరూపాయిలనోటు అంటించింది. బాండ్ నోటును వెలుగుకు అడ్డంగా పట్టుకున్నాడు. జేబులోంచి భూతద్దంతీసి నోటును పరీక్షించాడు.

"ఇది దొంగనోటు అని మీకు ఎలా తెలుసు?" అడిగాడు లాక్ కళ్ళు మూసుకునే.

బాండ్ అతడిని సీరియస్‌గా చూచి, తరువాత ఆమెను చూచి పెదిమ విరిచి, "సమాధానం చెప్పండి మిస్ ...." అన్నాడు.

"సుందరి. సుందరీ అనే పిలవండి బాండ్! రిజర్వ్ బాంక్ అక్షరాలు!"

భూతద్దాన్ని అక్షరాలమీదికి జరిపి నాలుక కరుచుకున్నాడు బాండ్.

"తప్పు కనిపెట్టారా బాండ్?"

"లేదు" అన్నాడు లాక్ కళ్ళు తెరవకుండానే.

బాండ్ ఇబ్బందిగా కదిలి, "మిస్ సుందరీ! మీ తెలివిని అభినందిస్తున్నాను" అన్నాడు.

లాక్ కళ్ళు తెరవకుండానే చటుక్కున చెయ్యి చాపి కరెన్సీ నోటు లాక్కున్నాడు. క్షణంలో సగంసేపు ఒంటి కన్ను తెరచి తిరిగి కన్ను మూశాడు. నోటు జేబులో వుంచుకున్నాడు.

"రిజర్వ్డ్ బాంక్! అబ్సర్డ్! 'డి' అక్షరం ఎక్కువయింది" అన్నాడు లాక్.

"ఎస్. మీరు పట్టేశారు."

"అంతేకాదు మిస్ సుందరీ! నిన్న మీరు మార్కెట్టుకు వెళ్ళలేదు."

బాండ్ వాళ్ళిద్దరినీ మార్చి మార్చి చూశాడు.

"వెళ్ళలేదా? మీరు ఎలా వూహించారు?" అడిగింది సుందరి.

"ఆ విషయం తర్వాత. అబద్ధం ఎందుకు చెప్పారు?"

సుందరి చిరాకుగా కదిలి, "మీరు కళ్ళు తెరిచి మాట్లాడితే బాగుంటుంది" అంది.

లాక్ ఆమెకు సమాధానం యివ్వలేదు "మీవద్ద యిటువంటి కరెన్సీ నోట్లు ఎన్ని వున్నాయి?"

"మొత్తం నాలుగు!"

"ఎప్పటినుండీ యివి మీ వద్దకు వచ్చాయో గుర్తించ కలిగారా?"

"చెప్పానుగా. నిన్న నే....బట్టల షాపులో."

"కథలు చెప్పక...."

బాండ్ కలగచేసుకున్నాడు. "లాక్! నీ ప్రవర్తన చాల అసహ్యంగా వుంది. మాడం! మీరు ఏం తీసుకుంటారు.

"ఆమె ఏం తీసుకుంటారు? ఇప్పుడేకదా హోటల్లో మసాలాదోసె తిని వచ్చారు!" అన్నాడు లాక్.

సుందరి అతడిని ప్రేతాన్ని చూచినట్టు చూచింది.

చటుక్కున లేచి లాక్‌ను కుదపబోయింది. అప్పటికే లాక్ కళ్ళు తెరచి, "సుందరీ! అరికథలు ఆపి అసలు కథ చెప్పు" అన్నాడు.

సుందరి ఆగి, తలమీద చేతులు పెట్టుకుని కూర్చుంది.

"ఒక వారం క్రితం అనుకుంటాను. రోల్స్ రాయిస్

డ్రయివ్ చేస్తోన్నాను. దారికి అడ్డంగా ఒక బిచ్చగాడు వచ్చాడు. అతడు వందరూపాయిలు నోటు చూపించి కారు ఆపమన్నాడు. అతడి మొహం చూచి జాలివేసింది. కారు ఆపాను.

"అమ్మగారూ! వంద రూపాయలకు చిల్లర ఇస్తారా?" అడిగాడు అతడు.

నాకు చిరాకు కలిగింది. వందరూపాయిల చిల్లరకోసం రోల్స్‌రాయిస్ కారు ఆపుతారా? అనిపించి అంతలో నే సర్దుకున్నాను. వానిటిబాగ్ తెరచి చూశాను.

"పది రూపాయిల నోట్లయినా సరే!" అన్నాడు అతడు.

నేను వందరూపాయిలనోటు తీసుకుని పదిరూపాయిల నోట్లు పది లెక్కపెట్టి యిచ్చాను.

ఇంటికి వెళ్ళాక కూడా నాకు ఆ విషయం పదేపదే గుర్తుకువస్తోంది. బిచ్చగాడి చేతిలో వందరూపాయిల నోటు ఏమిటి? కారు పోర్టికోలో ఆపి దిగాను. ఇంతలో మురారి వచ్చాడు.

"మురారా? అతదెవరు?" అడిగాడు బాండ్ మధ్యలో.

"మా బావ. మేనబావ."

"మేనమామ ఎవరు?"

"భద్రయ్య."

"ఆయన ఏం చేస్తోంటాడు!" అడిగాడు లాక్.

"అధిక ప్రసంగం!" గొణుక్కున్నాడు జాండ్.

"మురారి వచ్చి "అరె! డబ్బు పారవేసుకున్నావు ఏమిటి?" అన్నాడు.

"డబ్బా?" అన్నాను.

మురారి సీటుమీదనుండి మూడు వందరూపాయినోట్లు అందుకుని యిచ్చాడు. నేను వాటిని నిర్లక్ష్యంగా వానిటీ బాగ్‌లో వేసుకున్నాను. ఈ రోజు మార్కెటింగ్‌కి వెళ్ళాలని యిద్దరమూ బయలుదేరబోయాం. డబ్బు లెక్క పెడుతూ మురారే చూశాడు. రిజర్వ్‌డ్ బాంక్ అనే అక్షరాలు చూశాం. దొంగనోట్లు అని తెలుసుకున్నాం."

"అయితే మురారి మీవెంట రాలేదేం!" అడిగాడు బాండ్.

లాక్ పరిహాసంగా నవ్వి, "ఆయన కారులో కూర్చు న్నారు" అన్నాడు.

సుందరి అతడిని విడ్డూరంగా చూచి, "చూడబోతే మీకు వ్యవహారం అంతా తెలుసు గాబోలు!" అంది.

లాక్ అతి సామాన్యంగా కదిలి, బయటకు వెళ్ళాడు. తిరిగి అతడు వచ్చేటప్పటికి అతడివెంట ముప్ఫయ్యేళ్ళ యువకుడున్నాడు.

"మిష్టర్ మురారీ! కూర్చోండి!" అన్నాడు బాండ్ హుందాగా.

మురారీ, లాక్ కూర్చున్న తరువాత సుందరి బరువుగా నిట్టూర్చింది.

లాక్ అతడిని చిరునవ్వుతో చూచి, తరువాత సుందరి వైపు తిరిగాడు.

"సుందరీ! మీకు దొంగనోట్లు కనిపించి రోజుల తరబడి అయింది. అయినా ఈ రోజువరకూ మీరు వాటి విషయమై పరిశోధించమని మమ్మల్ని కోరలేదు" అడి గాడు లాక్.

"ఇంతకాలం కోరవచ్చునా లేదా అని తటపటా యించాను. చివరకు మురారిని సలహా అడిగాను.

'విషయం అంతా తెలుసుకో' అన్నాడు మురారి."

"మురారీ....మీరు చాలా మంచి పనే చేశారు!" అన్నాడు బాండ్.

లాక్ నవ్వి, "ఇపుడు చెప్పు సుందరీ! కొత్తగా ఏర్పడిన పరిణామం ఏమిటి?" అన్నాడు.

"బాగా వూహించారు. నా గాడ్రెజ్ బీరువాలో నోట్లకట్టలున్నాయి. అవి అన్నీ మారిపోయాయి. అంటే దొంగనోట్లు అయిపోయాయన్నమాట!"

"బీరువా తాళం చెడిందా?"

"చెడింది. అందుకే అనుమానంగా నోట్లకట్టలు పరిశీలించాను. అన్నీ దొంగనోట్లే!"

"ఈ విషయం ముందే చెప్పవచ్చుకదా!" కలగచేసుకున్నాడు బాండ్.

లాక్ అతడికి కనుసైగచేసి, "ఆల్ రైట్ మీ ఇంటిని ఒకసారి చూడాలి!" అన్నాడు ఆమెవైపు తిరిగి.

ఆమె తలూపి లేచింది.

2

రోల్స్‌రాయిస్ కారు గేటు దాటింది. అందమైన భవంతి పోర్టికోలో ఆగింది. కారులోంచి బాండ్, లాక్, మురారీ, డ్రయివింగ్ సీట్లోంచి సుందరీ దిగారు. సుందరి ముందు దారితీసింది. నలుగురు మెయిన్ హాలులో ప్రవేశించారు.

మెయిన్ హాలులో నడివయస్కురాలు చటుక్కున కుర్చీలోంచి లేచింది.

"మా అత్తయ్య పార్వతమ్మ. ఆమె ఒంటరిది నాకు లాగానే" అంది సుందరి.

పార్వతమ్మ చూస్తోంది.

"ఆమెకు మూగ, చెవుడూ వున్నాయి కదా!" అన్నాడు లాక్.

"అవును."

"మీ యిద్దరితో బాటు యింత విశాలమైన భవనంలో యింకా ఎవరెవరుంటారు?"

"ఒక తోటమాలీ, ఒక పనిమనిషీ ఇద్దరూ భార్యాభర్తలే, అవుట్ హౌస్‌లో వుంటారు."

బాండ్ తలూపాడు.

"మీ గదివైపు పదండి!" అన్నాడు లాక్.

సుందరి మేడమీదకు దారితీసింది.

అందమైన గది. విశాలంగా వుంది. గదిలో ఒకమూల గాడ్రెజ్ బీరువా వుంది. అదికాక రెండు కుర్చీలూ వాటిమధ్య రోజ్ వుడ్ టీపాయ్, గది గోడకు నిలువుటద్దమూ వున్నాయి.

బాండ్ అద్దంలోకి చూసుకున్నాడు. గది చాలవరకూ అద్దంలో ప్రతిఫలిస్తోంది.

అద్దంలోంచి కనిపిస్తోంది. సుందరి గాడ్రెజ్ బీరువాను సమీపిస్తోంది. తాళంచెవులతో బీరువా తెరచింది. నోట్లకట్టలు తీసి టీపాయ్‌మీద సర్దింది. లాక్ వాటిని పరిశీలనగా చూశాడు. జేబులోంచి వందరూపాయిల నోటు తీసి సరిపోల్చాడు.

బాండ్ అద్దంలోంచి గమనిస్తూనే అటు కదిలాడు. టీపాయ్‌మీద వందరూపాయిల నోట్లకట్టలు తాకి తల పంకించాడు.

"మీ యింట్లోకే నేరుగా దొంగనోట్లు వచ్చాయి. ఈ విషయమై మీరు ఎవరినయినా అనుమానించే అవకాశం వుందా?" అడిగాడు బాండ్.

సుందరి మాట్లాడబోయింది. కిటికీవద్ద అలికిడయింది. గాజు తలుపులకు అవతల ఎవరో కదిలినట్టయింది. బాండ్ బాణంలాగా పరుగెత్తాడు.

కిటికీ వద్ద పనిమనిషి చీపురు పట్టుకుంది. బూజులు దులుపుతోంది. బాండ్ ఆమెను సమీపించాడు. ఆమె అమాయకంగా కళ్ళెత్తి రెప్పలు టపటపలాడించింది.

"నువు యిక్కడే పనిపడిందా?" అడిగాడు బాండ్.

ఆమె సైగచేసింది. బాండ్ తలమీద మొట్టుకుని తిరిగి గదిలోకి వచ్చాడు.

"మీ పనిమనిషి కూడా మూగదా?" అడిగాడు బాండ్.

సుందరి మందహాసం చేసింది. "ఆమె భర్త రాములు ఆదే తోటమాలి — ఆమెను ఎవరితోనూ మాట్లాడవద్దంటాడు. అందుకే ఆమె మూగతనం ప్రదర్శిస్తుంది."

"ఆమెకు దొంగనోట్లతో సంబంధం వుందేమో!" అన్నాడు బాండ్....

"సీతకా? ఇంకా నయం!"

లాక్ మెల్లగా బాండ్ భుజం తట్టి, సుందరివైపు తిరిగి "తరచుగా యీ యింటికి ఎవరు వచ్చిపోతూంటారు?" అన్నాడు.

"నాకు ఈ పట్నంలో వున్నదల్లా మురారీ బావా, మేనమామా, మేనత్తా-వీళ్ళే బంధువులు! ఈ వారంలో మురారి తప్పించి యెవరూ రాలేదు."

"ఫ్రెండ్స్."

"ఫ్రెండ్స్ అంటూ పెద్దగా యెవరూ లేరు. లక్ష్మి అని మా క్లాస్‌మెట్ వుంది. అంతే!"

"ఆమె వచ్చి పోతూంటుందా!"

"అప్పుడప్పుడూ...."

"ఈ వారం రోజుల్లో వచ్చిందా?"

సుందరి ఆలోచించి, "నాలుగు వందరూపాయినోట్లు కనిపించిననాడు ఆమె వచ్చింది" అంది.

"లక్ష్మి అడ్రసు చెబుతారా!" అన్నాడు బాండ్.

"నాలుగూ ఆరూ ముప్పయి, మద్దిలపాలెం" చెప్పింది సుందరి. బాండ్ నోటుచేసుకున్నాడు.

"సుందరీ! పద! వందరూపాయిల చిల్లర అడిగిన ప్రదేశం చూపించు!"

సుందరి కదిలింది. నలుగురినీ ఎక్కించుకుని రోల్స్ రాయిస్ కారు హైవేమీద ఆగింది. రాళ్ళ కొట్టే ప్రాంతం అది. ఎత్తయిన బండరాళ్ళున్నాయి.

నలుగురూ కారు దిగారు. "ఇక్కడే! చిల్లర యిచ్చి వందరూపాయిల నోటు సంపాదించుకున్నాను!" అంది సుందరి.

"కారును చూచి బిచ్చగాడు వచ్చాడు కదా!" అడిగాడు.

సుందరి తలూపింది.

"ఎటునుండి వచ్చాడు?"

సుందరి ఎడమప్రక్కకు చూపించింది. అప్పటికే లాక్ ఎడమవైపు వున్న పెద్ద బండరాళ్ళవైపు కదిలాడు. బండరాళ్ళకు దిగువన పెద్ద క్వారీ వుంది. క్వారీకి బండ రాళ్ళకూ మధ్యగా రాళ్ళూ రప్పలూ పిచ్చి మొక్కలూ వున్నాయి.

పిచ్చి మొక్కలమధ్య ఆగాడు లాక్. చెత్త కాగి తాలూ వర్షానికి తడిసి, రంగు వెలసిపోయిన సిగరెట్టు పెట్టె రెండు సిగరెట్ పీకలూ అక్కడ కనిపించాయి.

లాక్ సిగరెట్ పెట్టె చేతిలోకి తీసుకున్నాడు. ఖాళీ సిగరెట్ పెట్టె!

"ట్రిబుల్ ఎక్స్.... బొమ్మ అస్పష్టంగా వున్నా నాకు ఈ బ్రాండ్ తెలుసు" అన్నాడు లాక్.

బాండ్ విసురుగా పెట్టె లాక్కుని, "సుందరిని చూచి నీకు మతి పోయింది. ఆమె గమనిస్తోందని చెప్పి గొప్ప చేస్తోన్నావు" అన్నాడు.

"స్టాప్! సుందరి వస్తోంది."

సుందరి వాళ్ళిద్దరినీ సమీపించింది.

"మిష్టర్స్! రండి కారు దగ్గర మా మామయ్య మీ కోసం ఎదురు చూస్తూన్నాడు" అంది సుందరి.

"హలో భద్రయ్యగారూ!" చురుకుగా అటు నడిచాడు బాండ్.

భద్రయ్య ఆప్యాయంగా అతడి చెయ్యి నొక్కాడు.

"నన్ను డిటెక్టివ్ బాండ్ అంటారు. 007 కాదు. మామూలు బాండ్!" నవ్వాడు బాండ్.

"సంతోషం బాబూ! మా అమ్మాయి....అదే మేన కోడలు యిబ్బందిలో వున్నట్టు ఈ రోజే తెలిసింది. మురారి కూడా చెప్పలేదు. ఈ కాలం పిల్లల తీరు అర్థం కాదు బాబూ!"

భద్రయ్య మాట్లాడుతోండగా అక్కడికి లాక్ వచ్చాడు.

సుందరి తన మామయ్యకూ లాక్ కూ పరస్పర పరి చయం చేసింది.

"సిగరెట్టు పెట్టె ఏమిటి బాబూ!" అడిగాడు భద్రయ్య. మురారి కూడా పెట్టెవైపు ఆశ్చర్యంగా చూశాడు.

"సుందరికి వందరూపాయిల నోటు అంటకట్టిన బిచ్చగాడు యిక్కడే సుందరి రాకకోసం వేచికూర్చున్నాడు. అప్పుడే సిగరెట్స్ కాల్చి వుంటాడు. అతడు విడిచిపెట్టిన పెట్టె. త్రిబుల్ ఎక్స్ సిగరెట్ పెట్టె."

"మీ డిటెక్టివులకు పీటిమీద వ్రేలిముద్రలు కనిపిస్తాయి! అవునా?"

బాండ్ చురుకుగా చూచి, "వ్రేలిముద్రలు వుండటమంటూ సంభవిస్తే అవి ఎవరికయినా కనిపించితీరతాయి" అన్నాడు.

లాక్ కళ్ళు మూసుకున్నాడు.

"బిచ్చగాడి రూపురేఖలు వర్ణించు మిస్ సుందరి!" అన్నాడు బాండ్.

సుందరి చుట్టూ చూసింది. మురారి నన్ను కానట్టుగా చూచిన కొండవైపు చూపుసారించాడు.

"అతడు మామయ్య అంత లావుగా వుంటాడు. మురారి బావ అంత ఎత్తు ఉంటాడు. నల్లగా మాసిన గడ్డం. తీక్షణమైన చూపులు. బట్టలు మాసి వున్నాయి" అంది సుందరి.

"కాళ్ళకు స్లిప్పర్స్ వున్నాయా?"

"చూడలేదు."

"పదండి పోదాం!" అన్నాడు లాక్ కళ్ళు తెరచి.

సుందరి రోల్స్‌రాయిస్ వైపు బయల్దేరింది. దాని వెనుక ఆగిన అంబాసిడర్ కారు వైపు భద్రయ్య మురారీ కదిలారు.

"మనం ఎటు వెళ్దాం?" అడిగాడు బాండ్.

"నడిచి. నగరం వైపుగా" అన్నాడు లాక్.

"ఎందుకు?" బాండ్ అసహనంగా అడిగాడు.

"బిచ్చగాడి ఆరా తెలుస్తుంది!"

"ఎక్కడ?"

"ఆ కనిపించే కిళ్ళీకొట్టు దగ్గర."

"మిస్టర్ బాండ్ అండ్ లాక్!" పిలిచింది సుందరి.

అపరాధ పరిశోధకులిద్దరూ రోల్స్‌రాయిస్ వైపు నడిచారు. "మాకు కొద్దిగా పనుంది. మీరు వెళ్ళండి" అన్నాడు లాక్.

సుందరి నవ్వింది.

కార్లు రెండు బయలుదేరి వెళ్ళిపోయాయి.

లాక్, బాండ్ రోడ్డుమీద నడవసాగారు.

3

ఎక్కడో కోడి కూస్తోంది. గూర్ఖా హైవేమీద ఆగాడు. హైవే ప్రక్కగా కిళ్ళీకొట్టు వుంది. గూర్ఖా అటు నడిచాడు.

కిళ్ళీకొట్టును సమీపించాడు గూర్ఖా. బీడీతీసి ముట్టించు కున్నాడు. అగ్గిపుల్ల విసరబోతూ అలాగే నిలబడి పోయాడు. గాలికి అగ్గిపుల్ల ఆరిపోయింది.

కిళ్ళీకొట్టు తలుపు ఓరగా తెరచి వుంది. తలుపులోంచి నేలమీదకు ప్రాకినట్టు ఏదో వస్తువు కనిపిస్తోంది. గూర్ఖా వస్తువుమీదకు వంగాడు.

అవి కాళ్ళు.

గూర్ఖా కాళ్ళను తట్టి "సోములూ! సోములూ!" అన్నాడు. కాళ్ళు మంచుముక్కల్లా తగిలాయి.

గూర్ఖా చటుక్కున చేతులు వెనక్కి లాక్కున్నాడు.

జేబులోంచి బాటరీలైట్ తీశాడు. స్విచ్ ఆన్ చేశాడు. కిళ్ళీకొట్టులోకి ఫోకస్ చేశాడు.

సోములు వెల్లకిలా పడివున్నాడు. గూర్ఖా తిరిగి రోడ్డుమీదకు వచ్చాడు. మొహం, శరీరం చెమటలు పట్టాయి. షర్టు విప్పి గాలి పోసుకున్నాడు. చకచక రోడ్డుమీద నడవసాగాడు. పబ్లిక్ టెలిఫోన్ బూత్ను సమీపించాడు.

క్రయిమ్ బ్రాంచ్ ఆఫీసుకు ఫోన్ చేశాడు.

అరగంటలో నాలుగు పోలీస్ వాన్లూ, ఒక అంబులెన్స్ వాన్ కిళ్ళీకొట్టుముందు ఆగాయి. క్రయిమ్ బ్రాంచ్ యిన్స్పెక్టర్ కుమార్ కిళ్ళీకొట్టుముందుకు నడిచాడు.

ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీశాక వ్రేలిముద్రల నిపుణుడు కిళ్ళీకొట్టులో ప్రవేశించాడు.

"సోములు నీకు ఎలా తెలుసు?" అడిగాడు ఇన్స్పెక్టర్ కుమార్.

"నేను బీట్ నుండి తిరిగి వచ్చేటప్పుడు సాధారణంగా సోములును నిద్రలేపి వెళ్తాను. మా యిద్దరికీ పది సంవత్సరాలనుండి దోస్తీ!" అన్నాడు గూర్ఖా.

"సోములు కిళ్ళీకొట్టులో పండుకుంటాడా?"

"అవును సార్! హైవే రాత్రివేళలో నిర్జనంగా వుంటుంది. కిళ్ళీకొట్టులో పండుకుని తన షాపును కాచుకుంటాడు."

శవాన్ని వెలుపలకు తీసుకువచ్చారు. తూర్పున వెలుగు రేకలు విచ్చుకుంటున్నాయి. పాథాలజీ సర్జన్ ముందుకు వంగి సోములు శవాన్ని పరీక్షించాడు.

"శవం తల సల్లగా వుంది. తలమీద దెబ్బ తగలడం వలన ఇలా జరిగివుండాలి" అని శవం తలయెత్తి చూశాడు సర్జన్. తల వెనుక భాగంలో వుబ్బెత్తుగా వుంది.

"చిన్న మెదడుమీద సరాసరి దెబ్బ తగిలింది" అన్నాడు సర్జన్ తిరిగి.

కుమార్ తలూపి, "హత్యాయుధం ఏమైవుంటుంది?" అన్నాడు.

"క్లిక్కిళ్ళకొట్టులో వెతికించండి" అన్నాడు సర్జన్.

కుమార్ సార్జంటుకు పురమాయించాడు.

"ప్రాణంపోయి ఎంత సేపయి వుంటుంది?"

సర్జన్ శవం చెయ్యి వంచి చూశాడు. "రిగర్ మార్టిస్ ప్రారంభమవుతోంది. అంటే హత్య రాత్రి 12 తర్వాత 2 గం॥ల ముందు జరిగివుండాలి. హతుడితో బాగా పరిచయం వున్నవాడే చంపివుండాలి."

"ఆ విషయం ఎలా చెప్పగలరు సర్జన్?"

"క్లిక్కిళ్ళ కొట్టులోనే జరిగింది హత్య. తలుపు ఓరగా తెరచి వుంది. హతుడూ హంతకుడూ కొట్టులో వున్న అతి తక్కువ స్థలంలో మాట్లాడుకుంటున్నారు. అంటే హతుడికి అంత సమీపంగా వ్యక్తి పరాయివాడై వుండడు కదా!"

"హత్య కిళ్ళీకొట్టు లోపలనే జరిగిందని ఎలా చెప్పగలరు?"

"క్లిక్కిళ్ళకొట్టు లోపల బిస్కట్ల సీసాలు పగిలివున్నాయి. కిళ్ళీలు కట్టే సామగ్రి తలక్రిందులయింది. అంటే ఇక్కడే హతుడిమీద దాడి జరిగిందన్నమాట!"

కుమార్ పాయింట్స్ నోట్ చేసుకున్నాడు. శవాన్ని అంబులెన్స్‌కు తరలించారు.

ఇద్దరు కానిస్టేబుల్స్‌నూ, సార్జెంటునూ కిళ్ళీకొట్టు దగ్గర కాపలా వుంచి—కుమార్ జీపులో బయలుదేరాడు.

లాక్ కళ్ళు మూసుకు కూర్చున్నాడు. బాండ్ టేబులుమీద కాళ్ళు చాపి, సిగరెట్ ముట్టించాడు.

"లాక్! సుందరి పేరు సుందరేశన్ అని నీకు యెలా తెలుసు?" అడిగాడు బాండ్.

లాక్ మాట్లాడలేదు.

"సుందరి మన దగ్గరకు వచ్చేముందు మసాలాదోశె తిన్నదని చెప్పావు. ఎలా చెప్పగలిగావ్?"

"వంద రూపాయిలనోటు మసాలదోశె వాసన వేసింది. బిల్లు చెల్లించడానికి ఆమె దోశె తిన్న చేతితోనే వానిటీ బాగ్‌లో చెయ్యి పెట్టిందన్న మాట!"

"మరి షాపింగ్ విషయం?"

"చూడు బాండ్! సుందరి నిన్న మార్కెటింగ్ చేశానని చెప్పింది. బట్టలు కొనడానికి వెళ్ళిందట. అది మార్కెటింగ్ ఎలా అవుతుంది? షాపింగ్. బాగా నాగరికత వున్న యువతి ఎందుకలా కంగారుపడింది? అంటే ఎక్కడో ఎందుకో అబద్ధం చెబుతోందన్నమాట!"

"గుడ్ లాజిక్ మిష్టర్ షెర్లాక్!"

"లాక్. దట్సాల్!"

"ఆమె యింకా కొన్ని రహస్యాలు దాచినట్టు ఎలా తెలుసుకున్నావు?"

"అది వృత్తి రహస్యం బాండ్."

బాండ్ రెండు కాళ్ళూ టేబిలుమీదనుండి దింపి లాక్ కూర్చున్న కుర్చీని ఫెడీమని తన్నాడు. టేబిలుకి దూరంగా కుర్చీ తుళ్ళింది. లాక్ ఎగిరి కార్పెట్ మీద పడ్డాడు.

బాండ్ విలాసంగా నవ్వి, "నేనూ నీ వృత్తిలో

లేనా?" అన్నాడు.

లాక్ కార్పెట్ మీద పడుకుని కళ్ళు మూసుకున్నాడు.

"ఉన్నావు. విగ్రహం పుష్టి!"

"నాన్సెన్స్! నీకు సుందరిని చూచి మతి చలించింది."

"కాదు. నీకు జోగినాథం తెలుసా?"

"ఏ. జోగినాథం."

"ఏ! జోగినాథం. అరటికట్టల జోగినాథం. అరటి ఆకులు అమ్మి లక్షలు కూడబెట్టాడు."

"అతడా? అతడు చనిపోయి ఏడాదవుతోందికదా!"

"చనిపోయికాదు బాండ్! ఉరిపోసుకుని!"

"అవును. అతడు ఉరిపోసుకుని కదూ చనిపోయాడు."

"అతడు నా క్లయంట్ గా వుండేవాడు. అప్పట్లో నేనూ లా ప్రాక్టీస్ వెలగబెట్టానులే! సుందరి అప్పుడు నాకు పరిచయం! ఒన్ వే ట్రాఫిక్ పరిచయం, ఆమె జోగినాథం కూతురిని నాకు తెలుసు. నేను తన తండ్రికి లీగల్ అడ్వయిజర్ నని ఆమెకు తెలియదు!"

"ఐ.సీ."

"అతడి ఆత్మహత్యకు కారణం సుందరి ప్రేమ పురాణం."

"హౌజిట్?"

"బాండ్! తెలుగులో ఆశ్చర్యపో. ఆంగ్లంలో కాదు! సుందరి ప్రియుడు మురారి. మురారి వలన ఆమె పెళ్ళి కాకముందే గర్భవతి అయింది. అబార్షన్! జోగినాథంకు తల కొట్టినట్లయింది."

"ఏం? మురారిని తన్ని అయినా పెళ్ళి చేయించవచ్చు కదా!"

"మురారి దేశంమీదకు పారిపోయాడు. జోగినాథం

కుమిలిపోయాడు. భద్రయ్య తన కొడుకు గురించి భరోసా కలిగించ ప్రయత్నించాడు. జోగినాథం నమ్మినట్టే నమ్మి ఉరితాటికి వేలాడిపోయాడు పాపం!"

"ఏమైనా సుందరిదే తప్పు!"

"అందుకే ఆమె మురారిని యింకా ప్రేమిస్తోన్నట్టుగానే వుంది. మురారికి మాత్రం ఆమెమీద మోజు తప్పిపోయింది."

"జోగినాథం ఆస్తి ఏమాత్రం వుంటుంది?"

"పాతిక ముప్ఫయిలక్షలపై చిలుకు వుంటుంది. ఈ ఏడాదిలో అది యింకా గుడ్లుపెట్టి వుంటుంది!"

"ఇంతకు బిచ్చగాడిగా నటించిన వ్యక్తి ఎవరు? అతడు నాలుగు వందరూపాయినోట్లు సుందరికి అందించడానికి కారణం ఏమిటి? సోములు మనల్ని ఈ రోజు ఉదయం రమ్మన్నాడు. అతడికి ఈ విషయాలు ఎంత వరకూ తెలుసు?"

"సోములు బిచ్చగాడిగా నటించిన వ్యక్తిని చూశాడు కదా! అతడికీ సోములుకూ పూర్వ పరిచయం వున్నదేమో!"

"నిన్న నువు సోములు కిళ్ళీకొట్టువద్ద కాపలా వుండవలసింది. ఏమైనా తెలిసేదేమో!"

"సోములు...." లాక్ కళ్ళు చటుక్కున తెరచుకున్నాయి. గుమ్మంలోంచి బూట్లు టకటకలాడించుకుంటూ పోలీస్ యిన్‌స్పెక్టర్, ఇద్దరు కాన్‌స్టేబుల్సూ ఒక హెడ్ కాన్‌స్టేబులూ వచ్చారు. లాక్ వద్దా, బాండ్ వద్దా కానిస్టేబుల్సు డ్యూటీ వేసినట్టుగా నిలబడిపోయారు.

"క్రయిమ్ బ్రాంచ్...." బాండ్ గొంతు పొడారిపోయింది.

"ఎస్. ఇన్‌స్పెక్టర్ కుమార్!"

లాక్ కళ్ళు మూసుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్ కుమార్ బల్లమీద కాలు పెట్టాడు. ముద్దాయిని చూచినట్టుగా బాండ్‌నూ, లాక్‌నూ పరకాయించి చూశాడు.

"మీ యిద్దరూ ఎవరు?" లాఠీ టకటకలాడింది బల్ల మీద.

"డిటెక్టివ్ లాక్ అండ్ బాండ్!" బాండ్ గొంతు గుటకపడింది.

"మీలో లాక్ ఎవరు? బాండ్ ఎవరు?"

"శవాసనం వేసినవాడు లాక్!"

"బాండ్! మిమ్మల్ని యిద్దరినీ అరెస్టు చేస్తున్నాను."

"ఎం ...దు....కు?"

"సోములును హత్య చేసినందుకు!"

"సోములు హత్య చేయబడ్డాడా??"

ఇన్‌స్పెక్టర్ కుమార్ కార్పెట్ మీదకు చూశాడు. "లాక్! నీ కళ్ళకు లాక్ పడిందా? లేవరా రాస్కెల్? హెడ్! వాడిని ముక్కాలు విరగతన్ను. డిజ్ ఓబీడి యన్స్! పోలీసు అంటే ఎవడికీ లక్ష్యంలేదు!"

లాక్ మీదకు వంగబోయాడు హెడ్‌కాన్‌స్టేబులు. లాక్ స్ప్రింగ్‌లా లేచాడు. "సోములు ఎన్ని గంటలకు చనిపోయాడు ఇన్‌స్పెక్టర్?" అన్నాడు.

కుమార్ వాళ్ళను వ్యంగ్యంగా చూచి, "మీ ఇద్దరూ ఎన్ని గంటలకు చంపారో అన్ని గంటలకే!" అన్నాడు.

"మాకు అతడిని చంపవలసిన అవసరం ఏం వుంది?"

"నిన్న అతడు కిళ్ళీకొట్టులో వుండగా మీ ఇద్దరూ అతడితో మాట్లాడారు. అతడితో మీరు మాట్లాడే అవ

కాళం ఏం వచ్చింది?"

బాండ్ గొంతు సవరించుకుని చెప్పబోయాడు.

"మీ యిద్దరికీ ప్రయివేట్ యిన్వెస్టిగేషన్ చేయడానికి లైసెన్స్ వుందా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"వుంది సార్!"

"గుడ్ అంతా సిద్ధంగానే వుంచుకున్నారన్నమాట! పదండి స్టేషన్‌కు!" కుమార్ ఆవేశంతో వూగిపోయాడు.

అపరాధపరిశోధకులిద్దరూ కదిలారు. పోలీస్ జీపులో స్టేషన్‌కు చేరుకున్నారు.

బాండ్, లాక్ యిన్‌స్పెక్టర్‌తో సుందరి తమ దగ్గరకు వచ్చింది లాగాయితూ చెప్పారు.

"సుందరీ ఆమె బంధువులనూ అటు పంపించి మేమిద్దరమూ సోములు దుకాణం చేరుకున్నాం. అతను బిచ్చగాడిగా సుందరి చెప్పిన వ్యక్తిని చూశాడు. అతడి విషయమై పూర్తి వివరాలు యీరోజు యిస్తానన్నాడు" అన్నాడు లాక్.

"ఇదంతా నమ్మమంటావా మిష్టర్ లాక్?"

"మీ యిష్టం! నమ్మినా నమ్మకపోయినా సరే చెప్పదగింది యింతే!"

"సుందరి ఫోన్ నెంబరెంత?"

లాక్ చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ కుమార్ డయల్ చేశాడు. అవతల సుందరి పలికింది.

"డిటెక్టివ్ లాక్ అండ్ బాండ్ మీ విషయంలో పని చేస్తున్నారా?" అడిగాడు కుమార్.

"అవును సార్! ఏమయింది?"

"మీరు ఒకసారి క్రయిమ్‌బ్రాంచ్ ఆఫీసుకు రావలసి వుంటుంది."

"తప్పకుండా" అవతల క్లిక్‌మంది.

పదినిమిషాల్లో సుందరి వచ్చింది. జరిగిన విషయం తెలుసుకుంది.

"వెరీ సారీ! మీరు యిటువంటి యిబ్బందిలో పడతారని వూహించలేదు. పోతేపోయిన డబ్బు! మీరు కేసు మానుకోండి!" అంది సుందరి.

"అదెలా సాధ్యం?" కుమార్ కలగ చేసుకున్నాడు. "సోములు హత్యకేసు తేలేవరకూ వీరిద్దరూ రిమాండ్‌లో వుండాలి!"

"నేను బెయిలు ఇస్తాను! ప్లీజ్! ఇన్‌స్పెక్టర్ గారూ! నామూలయిన వీరు జెయిలుపాలు కాకూడదు."

"ఆల్ రైట్! వీరు నేను చెప్పేటంతవరకూ పట్నం వదలడానికి లేదు."

అపరాధ పరిశోధకులు తలలూపారు. తర్వాత లాక్ కళ్ళు మూసుకున్నాడు.

"మీ అనుమతి అయితే సోములు కిళ్ళీ దుకాణాన్ని ఒకసారి పరిశోధించాలని వుంది" అన్నాడు బాండ్.

కుమార్ అయిష్టంగా తలూపాడు.

రోల్స్‌రాయిస్ కారులో సుందరీ, బాండ్, లాక్ బయలుదేరారు. సోములు కిళ్ళీ దుకాణం ముందు కారు ఆపింది సుందరి. షాపుముందు పోలీసులు యిద్దరు కాపలా వున్నారు. కుమార్ పేరు చెప్పి బాండ్ కిళ్ళీకొట్టులో ప్రవేశించాడు. పగిలిన సీసాలూ, తిరగబడిన కిళ్ళీసామగ్రీ యథాతథంగా వున్నాయి. బాండ్ గాజు అద్దాల షో కేసులోకి చూశాడు. వాటిలో సిగరెట్ పెట్టెలున్నాయి.

వాటిమధ్య ఒక వరుస ఖాళీ వుంది. ఖాళీగా వున్న కేసు గోడమీద సిగరెట్ పెట్టె అట్ట అంటించి వుంది. ట్రిబుల్ ఎక్స్ సిగరెట్ పెట్టె!

"లాక్!" అరిచాడు బాండ్.

కళ్ళు మూసుకుని నిలబడ్డవాడల్లా చటుక్కున కళ్ళు తెరచి షాపులోకి నడిచాడు.

"ట్రిబుల్ ఎక్స్ సిగరెట్ పెట్టెలో మిస్టరీ వుంది!" అన్నాడు బాండ్.

లాక్ చటుక్కున పగిలిన గాజుముక్కలు దాటి మూలకు చెయ్యి చాపాడు. సిగరెట్ పెట్టె చేతికి తగిలింది. లాక్ పెట్టె బయటకు తీశాడు. ట్రిబుల్ ఎక్స్ పెట్టె! లాక్ పెట్టె తెరిచాడు. పెట్టెలో సిగరెట్లున్నాయి.

బాండ్ కళ్ళు పెద్దవి చేశాడు.

ఇద్దరూ కలసి షాపు బయటకు వచ్చారు. సుందరి కారు స్టార్టుచేసింది.

5

మద్దిలపాలెం రోడ్డు దిగాడు బాండ్. ఇళ్ళ నెంబర్లు చూసుకుంటూ ఒక పెంకుటింటిముందు ఆగాడు.

"లక్ష్మి!" పిలిచాడు బాండ్.

ఒక పాతికేళ్ళ యువతి బయటకు వచ్చింది.

"ఎవరు!" అంది.

"నన్ను సుందరి పంపించింది. నా పేరు బాండ్" అన్నాడు బాండ్.

"బాండ్! అదేం పేరు జేమ్స్‌బాండ్‌లాగా."

"కావచ్చును. మురారితో మీ పరిచయం గురించి తెలుసుకోవాలి."

"ఎందుకు?"

"మురారిని సుందరి ప్రేమిస్తోంది. మీరు అతడిని పెళ్ళి చేసుకుంటారేమో తెలుసుకోమని నన్ను పంపించింది."

"అబ్సర్డ్! సుందరి అలాంటి విషయం వుంటే నాతోనే నేరుగా చెప్పి వుండేది. మిమ్మల్ని పంపి వుండేది కాదు."

బాండ్ నవ్వి, "సోములు మీకు బంధువు. అయినా మీరు అతడి బాడీని క్లయిమ్ చేయలేదు. ఎందుకని?"

"సోములు కొన్ని కొన్ని చట్టవిరుద్ధమైన పనులలో యిరుక్కున్నట్టు మాకు తెలిసింది. పైగా దారుణంగా ఎవరి చేతుల్లోనో హత్య చేయబడ్డాడు. ఆ కారణంగా నేను వెళ్ళలేదు."

"మురారికి ఈ హత్య విషయంలో సంబంధం వుండి వుంటే?"

"మీకు మతిపోయింది. మురారికి ఈ విషయంలో సంబంధం ఎలా వుంటుంది?"

"సోములు కిళ్ళీకొట్టుకు మురారి పోయిన వారం వెళ్ళాడు. తగాదా వేసుకున్నాడు."

"ఏ విషయంలో?"

"నీ విషయంలో. సోములు నీమీద మనసుపడ్డాడు. నీ విషయంలో యిద్దరికీ ఘర్షణ అయింది. ఆ సంగతి నీకు తెలుసా?"

"తెలుసు. కాని సోములును చంపవలసిన అవసరం లేదు మురారికి."

"ఏం?"

"సోములుమీద నేను అసహ్యం పెంచుకున్నాను. మురారికి సోములును చంపి నన్ను స్వాధీనం చేసుకో

కలసినంత అవసరంలేదు—"

"రాత్రి మురారి ఎక్కడ వున్నాడు?"

లక్ష్మి కళ్లు సిగ్గుగా చూశాయి. "ఇక్కడే!"

"మీరు యిద్దరూ కలసి సోములు కొట్టు దగ్గరకు వెళ్ళారు."

"అవును వెళ్ళాం."

"ఎందుకు?"

"సోములు మా యిద్దరినీ విడదీయడానికి కుట్ర పన్నాడు."

"ఎలా?"

"సుందరితో మురారికి సంబంధం వుంది. ఆమెను వంచించి మురారి పారిపోయాడు. ఆ విషయాలు నిరూపించే ఆధారాలూ, సుందరి ఎబార్షన్ చేయించుకున్న ఆసుపత్రి చీటీలూ సోములు సంపాదించాడు."

"వాటివలన మీ ప్రేమకు విఘాతం ఏమిటి?"

"మురారికి యింకా సుందరిమీద కొద్దో గొప్పో అభిమానం వుంది."

"నీమీద ప్రేమా, ఆమెమీద అభిమానమూ..."

"దాంట్లో నాకు తప్పు కనిపించలేదు."

"అవును. సుందరి దగ్గర లక్షలున్నాయి. నీ దగ్గర ప్రేమ వుంది!"

"మిస్టర్ బాండ్...!"

"రాత్రి నువ్వూ మురారీ సోములును కలిశారు. సుందరికి సంబంధించిన చీటీలు యివ్వమని కోరారు. తరువాత..."

"సోములు ఈ రోజు గడువు పెట్టాడు."

"అతడి వద్దకు ఎన్ని గంటలకు వెళ్ళారు నువ్వూ,

మురారీ?"

"రాత్రి పది అయివుంటుంది."

"సోములు రాత్రి నిద్రమాత్రలు మింగాడు" ఆమె మొహంలోకి పరిశీలనగా చూశాడు.

"నేను ఆ మాట మురారితో చెప్పాను. మేం వెళ్ళే సరికే అతడు మగతలో వున్నాడు."

"మగతలో వుండే మీతో మాట్లాడాడు. మగతలో వుండే ట్రిబుల్ ఎక్స్ సిగరెట్ పెట్టెమీద నీ పేరూ మురారీ పేరూ రాశాడు."

"సిగరెట్ పెట్టెమీద యిద్దరి పేర్లూ రాశాడా?"

"అవును."

"అంటే సోములు నిద్రమాత్రలు మింగి చనిపోయాడన్నమాట!"

బాండ్ మాట్లాడలేదు. నిద్రమాత్రలతో చనిపోయి వుంటే అతడి చిన్న మెదడు మీద దెబ్బ ఏమిటి?

వాకిట్లో రోల్స్‌రాయిస్ కారు ఆగింది. కారులోంచి సుందరీ, లాక్ దిగారు.

లక్ష్మిని సుందరి ఆప్యాయంగా పలకరించింది.

"లక్ష్మీ! నువ్వు మాకుగానీ క్రయిమ్ బ్రాంచ్ యిన్‌స్పెక్టర్‌కిగానీ చెప్పకుండా పట్నం వదలిపెట్టడానికి లేదు" అన్నాడు బాండ్.

లక్ష్మి అలాగేనన్నట్టు మూతి త్రిప్పింది. బాండ్ కారును సమీపించాడు.

"బాండ్! మన యిద్దరి బుర్ర చెడిపోయింది! త్వరగా సుందరిని పిలువ్!" అన్నాడు లాక్.

"సుందరీ! త్వరగా రా!" అరిచాడు బాండ్.

"బాండ్! డ్రయివింగ్ సీటులో కూర్చో!" లాక్

కళ్ళు మూసుకుని ముందు సీటులో కూర్చున్నాడు. సుందరి వెనక సీటులో కూర్చుంది.

రోల్స్‌రాయిస్ కారును రోడ్డుమీద వురికించాడు బాండ్. కారు మార్చ్యురీ వార్డుముందు ఆగింది. సుందరిని చెయ్యి పట్టుకుని లాక్ మార్చ్యురీ వార్డులోకి పరుగెత్తాడు.

ఐస్ పలకల మధ్య వున్న శవాన్ని చూపించాడు. సోములు శవం తెల్లగా పాలిపోయి వుంది.

"గుర్తుపట్టు సుందరీ! ఇతడే బిచ్చగాడిగా నటించాడు. అవునా?" అన్నాడు లాక్.

సుందరి స్మృతులు పేర్చుకుంటోంది.

"ఇతడే అతడు...!" ఆమె పెదిమలు వణికాయి.

6

"సోములు మరణం పెద్ద మిస్టరీ అయిపోయింది" కుమార్ ఆలోచనగా డిటెక్టివుల మొహాల్లోకి చూశాడు.

"సోములు నిద్రమాత్రలు ఎందుకు మింగాడు? నిద్ర మాత్రలు అతడే మింగాడా? యెవరయినా మింగించారా? మింగించివుంటే చిన్నమెదడుమీద బలంగా కొట్టడం దేనికి? సోములుకు బాగా పరిచయం వున్న వ్యక్తి లేదా వ్యక్తులు అతడిని హత్య చేసివుంటే ఈ దొంగనోట్ల వ్యవహారం ఏమిటి?" అన్నాడు బాండ్.

లాక్ కళ్ళుమూసుకు వింటున్నాడు.

"సుందరి యింట్లో గాడ్రెజ్ బీరువాలో నోట్లు ఎవరు మార్చారు? ఎవరికి అవకాశం వుంది?" అన్నాడు కుమార్.

మురారిని యింటరాగేట్ చేశారా?" అడిగాడు

బాండ్.

"లేదు. మురారి తండ్రి భద్రయ్యను యింటరాగేట్ చేశాను. మురారి ఈ ఉదయమే పనిమీద కలకత్తా వెళ్ళాడు."

"రాత్రంతా అతడు లక్ష్మితో గడిపాడు. తెల్లవారు తోనే కలకత్తా వెళ్ళాడు. తండ్రే కావాలని అతడిని కలకత్తా పంపివుంటాడు."

"కావచ్చు. అతడు కలకత్తా వెళ్ళినట్టు అతడిమీద అనుమానం వచ్చిన తర్వాత తెలిసింది. మురారిని త్వరగా రప్పించమని భద్రయ్యను హెచ్చరించాను."

"తోటమాలి భార్య సీత ఇతరులతో యెందుక మాట్లాడటం లేదు?" లాక్ కళ్ళు మూసుకునే అన్నాడు.

"దానికీ యీ సందర్భానికీ సంబంధం ఏమిటి?"

"వుండవచ్చు. గదిలో నేనూ, బాండ్ గాడ్రెజ్ బీరువాను పరిశీలించేటప్పుడు సీత కిటికీ వెనుక ప్రత్యక్ష మయింది. అంటే ఆమె ఆ మాటలు వినాలని ప్రయత్ని స్తోందన్నమాట. భర్తతో తప్ప ఆమె మాట్లాడదట. ఇదేం మూగతనం? మూగాంబిక! సీతనూ తోటమాలినీ వెంటాడాలి. వాళ్ళిద్దరికీ ఏదో రహస్యం తెలుసు!" లాక్ కళ్ళు తెరిచాడు.

"ఆల్ రైట్! పదండి. సుందరి యింటికి వెళ్ళివద్దాం" కుమార్ లేచాడు.

జీపులో ముగ్గురూ సుందరి యింటిముందు దిగారు. సుందరి యింట్లో లేదు. సుందరి అత్తయ్య సైగలతో చెప్పింది.

"తోటమాలి ఎక్కడ?" అడిగాడు కుమార్.

ఆమె అవుట్ హావుస్ వైపు చెయ్యి చూపించింది.

కుమార్, లాక్, బాండ్ అటు నడిచారు.

అవుట్ హావుస్ నిశ్శబ్దంగా వుంది. అవుట్ హావుస్ తలుపులు దగ్గరకు చేరవేసి వున్నాయి.

కుమార్ తలుపు తోశాడు. తలుపులు సులువుగా లోపలకు తెరచుకున్నాయి. కుమార్ గదిలోపల ప్రవేశించాడు. గదిలోంచి వంటింట్లోకి దారివుంది. వంటిల్లు అపరిశుభ్రంగా వుంది. యెక్కడ గిన్నెలు అక్కడే వున్నాయి. ఎంగిళ్ళు తీయలేదు.

"సీతా!" పిలిచాడు కుమార్. కాని జవాబులేదు.

వంటిల్లు దాటి పెరట్లోకి వచ్చాడు. అరటి చెట్లమధ్య నిలబడ్డాడు. అరటిచెట్ల చివర పొదలున్నాయి. వాటి ప్రక్కగా నుయ్యి. లాక్, బాండ్, అవుట్ హావుస్ లోంచి పెరట్లోకి వచ్చారు.

నూతిచుట్టూ మెత్తటి మట్టి. మట్టి దాటాక నూతి పళ్ళెం. లాక్ మట్టికి యివతల నిలబడ్డాడు.

"పళ్ళెంమీద అడుగుజాడలున్నాయి" అన్నాడు లాక్.

"పళ్ళెం శుభ్రంగా వుంది. అడుగుజాడలు నూతి గోడవైపు వున్నాయి. మట్టి జాడలు అవి తిరిగివచ్చినట్టు లేవు" కుమార్ ఆశ్చర్యంగా పళ్ళెం సమీపించాడు.

నూతిలోకి వంగి చూశాడు. నీటిమీద ఎర్రచీర బుడగలాగా తేలుతోంది. జుత్తుపాయలుగా విడిపోయి నీటిమీద పరచుకుంది.

శవం బోర్లాపడివుంది.

కుమార్ హాట్ తీసి చేతితో పట్టుకున్నాడు. లాక్, బాండ్ మొహాలు చూసుకున్నారు. తర్వాత లాక్ కళ్ళు మూసుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్ కుమార్ అవుట్ హౌస్‌లోకి పరు గెత్తాడు.

7

కుమార్ ప్రశ్నలు వేయడం మొదలు పెట్టాడు. తోటమాలి రాములు ఏడవడం మినహా సమాధానాలు యివ్వడంలేదు. అరగంట గడిచింది. రాములు కొంతవరకూ నిమితపడ్డాడు.

"రాములూ! నీ భార్యను చివరిసారిగా ప్రాణాలతో యెప్పుడు చూశావు?" అడిగాడు కుమార్.

"ఉదయం ఎనిమిది గంటలకు సార్! నాకు అమ్మ గారింట్లోంచి కాఫీ తెచ్చి యిచ్చింది. నేను పనిమీద బయటకు వెళ్ళాను."

"ఆమె ఉదయం నిమితంగా వుందా?"

"వుంది సార్!"

"నువ్వు బయటకు అంటే ఎక్కడికి వెళ్ళావు?"

"తోటలో పాతడానికి హైబ్రీడ్ మొక్కలకోసం సార్!"

"నర్సరీకా?"

"అవును సార్! బెంగుళూర్ నర్సరీ."

"సరిగ్గా ఎనిమిది గంటలకే వెళ్ళావా? బాగా గుర్తుకు తెచ్చుకో."

"అవును సార్! ఎనిమిది గంటలకే!"

కుమార్ రిసీవర్ ఎత్తాడు. టెలిఫోన్ డైరెక్టరీ తిరగ వేసి తర్వాత డయల్ చేశాడు.

"బెంగుళూర్ నర్సరీ .... ఎవరు మాట్లాడుతున్నా రండీ?" అటునుండి వినిపించింది.

"క్రయిమ్ బ్రాంచ్ యిన్‌స్పెక్టర్ కుమార్‌ను మాట్లాడుతున్నాను. ఈ రోజు మీ వద్దకు రాములు అనే అతడు వచ్చాడా?"

"రాములా సార్? ఎవరతడు?"

"సుందరి అని లక్షాధికారిణి. ఆమె యింటి తోట మాలి."

"వచ్చాడు సార్! హైబ్రీడ్ మొక్కలకోసం!"

"థాంక్యూ" కుమార్ రిసీవర్ క్రెడిల్ చేశాడు.

"మీ ఆవిడ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రత్యేకమైన కారణం వుందా?"

"దానికి నూతిలో దూకాలన్న బుద్ధి ఎందుకు పుట్టిందో నాకేం తెలియదు సార్!"

"మీ యిద్దరికీ మధ్యలో కలతలున్నాయా?"

"లేవు సార్!"

"మీ ఆవిడ పరాయి వాళ్ళతో మాట్లాడదట. కారణం ఏమిటి?"

"దానికి ఎవరితో ఏం మాట్లాడుతుందో తెలియదు సార్!"

కుమార్ తలపంకించసాగాడు. బాండ్ వైపూ లాక్ వైపూ మార్చి మార్చి చూశాడు. లాక్ మోచేతితో బాండ్‌ను పొడిచి, "రాములు చేతులు మచ్చలు పడ్డాయి" అన్నాడు. పైకి మాత్రం లాక్ అన్నాడు. "పోస్టుమార్టం రిపోర్ట్ రావాలి కదా!"

రాములు తనను కానట్టు చూశాడు.

రాములు చేతులమీద పొడలు పొడలుగా మచ్చలున్నాయి.

8 కారు బెంగుళూర్ నర్సరీముందాగింది.

"రాములును గురించి వర్ణించగలరా?" అడిగాడు లాక్.

"పొడవుగా వుంటాడు గూడకట్టు పంచె...." నర్సరీ యజమాని చెప్పాడు.

లాక్ పళ్ళు గిట్ట కరిచాడు. రాములు పొట్టిగా వుంటాడు. లుంగీ పంచె కట్టుకుని పైకి మడత మడుస్తాడు.

"తలకు పాగా చుట్టుకున్నాడా?"

"అవును సార్!"

లాక్ తలూపి అతడికి కృతజ్ఞతలు చెప్పి బయట పడ్డాడు. రోల్స్‌రాయిస్ కారు పోలీస్ స్టేషన్ ముందాగింది.

కుమార్ వాళ్ళను నవ్వుతూ చూశాడు.

"నిద్రమాత్రల పాట్లంమీది వ్రేలిముద్రలు సీతవే! ఆమె గ్లాసులో మాత్రలు కలిపి త్రాగింది. ఆమె వ్రేలి ముద్రలు గాజు గ్లాసుమీద వున్నాయి."

"ఇన్‌స్పెక్టర్ గారూ! నిద్రమాతలు మ్రింగాక సీత తనకుతానే నూతిలో దూకిందా?" అడిగాడు లాక్.

"ఊపిరితిత్తులలో నీరు చేరలేదు. అంటే నూతిలోకి పడేసరికే ఆమెలో ప్రాణంలేదు."

"నిద్రమాత్రలతోటే ప్రాణంపోయింది. తరువాత ఆమెను నూతిలో పారవేశారన్నమాట!"

"నిద్రమాత్రల పాట్లంమీద ఆమె వ్రేలిముద్రలూ, నూతి పళ్ళెంమీద ఆమె పాదాల ముద్రలూ అచ్చొత్తారు."

"తోటమాలి రాములుకు అంత తెలివితేటలు

న్నాయా?"

"బెంగుళూర్ నర్సరీకి రాములుకు బదులుగా వెళ్ళిన వ్యక్తి అతడికి యీ తెలివితేటలు నుప్పివుంటాడు. ఆ వ్యక్తికోసం గాలించనక్కరలేదు. రాములును పట్టుకుని నాలుగు వుతికితే చాలు!"

గుమ్మం దగ్గర అలికిడయింది. కాల్యాట్ కొట్టి సార్జెంట్ లోపలకు వచ్చాడు.

బాండ్, లాక్ బయటకు నడిచారు.

"మారు తాళం చెవుల గుత్తి సిద్ధంగా వుంది" అన్నాడు లాక్.

"ఇంట్లో అతడి భార్య వుంటుందేమో!" అన్నాడు బాండ్.

"వుండవచ్చు. లేదా ఫోన్ చేసి ఆమెను సుందరి యింటికి రప్పించవచ్చును."

బాండ్ పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లో ప్రవేశించాడు. రెండు నిమిషాల తర్వాత బూత్ నుండి బయటపడ్డాడు.

"ఆమె బయలుదేరుతుంది. సుందరి యింటికే!" అన్నాడు.

"గుడ్...." లాక్ కారును వురికించాడు.

గేటుముందు ఆగింది కారు. లాక్, బాండ్ కారు దిగారు. వేగంగా గేటుదాటి తలుపుముందు నిలబడ్డారు.

"చాలా తొందరగా బయలుదేరింది. సుందరికి ప్రమాదం అనే చెప్పి వుంటావు" మారు తాళాలగుత్తి బయటకు తీశాడు లాక్. క్షణాలలో తలుపు తెరచుకుంది.

ఇద్దరూ లోపలకు నడిచారు. మెయిన్ హాలుకి అటు యిటూ గదులు వున్నాయి. ఇద్దరూ రెండు ప్రక్కలా వెతకసాగారు. అయిదు నిమిషాల తర్వాత ఇద్దరూ తింగి

మెయిన్ హాలులో కలుసుకున్నారు.

"బ్యాంక్ అక్కౌంట్ పుస్తకం దొరికింది. అమవుంట్ సరిపోయింది" అన్నాడు బాండ్.

"రైట్!" లాక్ ముందుకు నడిచాడు. మెట్లు పైకి వెళ్తున్నాయి. మెట్ల ప్రక్కగా నడవా దారితీస్తోంది. అక్కడ గోడతో నడవా అంతమయింది.

"లాక్! నువ్వు అన్నమాట నిజమే! రాములు చేతులు కెమికల్స్ వాడినందువల్లనే మచ్చలుపడ్డాయి. అతడికి కెమికల్స్‌తో పని ఏమిటి?"

"అవును...బాండ్! రాములు బదులుగా మురారి బెంగుళూర్ నర్సరీకి వెళ్ళాడు. అంటే రాములుకు ఎలిబీ యిచ్చాడు. రాములు ఆ సమయంలో సీతను చంపాడు."

లాక్ గోడను సమీపించాడు. గోడ తడిమాడు. బాండ్ గోడలకున్న కాలెండర్లు తప్పించాడు. గోడ రంగులో కలిసిపోయిన స్విచ్ కనిపించింది. బాండ్ స్విచ్ నొక్కాడు.

గోడలో కొంత భాగం అడ్డం తప్పుకుంది. మనిషి పట్టేటంత భాగం. లాక్ గోడలోంచి లోపలకు నడిచాడు. బాండ్ అతడిని అనుసరించాడు. గోడ వెనుక పెద్ద హాలు వుంది. హాలులో రకరకాల యంత్ర సామగ్రి. బల్లలమీద పాత్రలూ వాటిలో రంగుల మిశ్రమాలూ వున్నాయి. లాక్ వాటిని దాటాడు. రాక్‌లో వరుసగా అమర్చిన బాటిలూ, వాటికి అవతల సమతూకంలో కత్తిరించివున్న తెల్లని విదేశీ కాగితమూ వున్నాయి. కాగితాల కట్ట లోంచి ఒక కట్ట ఎత్తాడు బాండ్.

"వంద రూపాయిల నోటు ముద్రించే కాగితాలు!"

అన్నాడు బాండ్.

లాక్ తలూపి ఫోటోలు తీయసాగాడు.

9

డిటెక్టివ్ బాండ్ హస్తవానికి రాములు బెంబేలెత్తిపోయాడు.

"రాములూ! నువు సీతను హత్య చేశావు. నీ చేతులతోనే ఆమెకు నిద్రమాత్రలు యిచ్చావు. తరువాత ఆమెను నీటిలో గిరవాటు వేశావు. నూతి పళ్ళెంమీద ఆమె పాదం ముద్రలు అచ్చువేశావు. నిద్రమాత్రల పొట్లంమీద, గాజు గ్లాసుమీద ఆమె వ్రేలిముద్రలు వేశావు" లాక్ అతడి మెడ పట్టుకున్నాడు.

బాండ్ అతడి నోటివద్ద మైక్ పెట్టాడు. టేప్ రికార్డర్ను చేతిలో పట్టుకున్నాడు. రాములు బిగుసుకుపోయాడు. "అవును బాబూ! నా సీతను నేనే చంపుకున్నాను. నాది తప్పే బాబూ" అన్నాడు.

"సోములును ఎవరు చంపారు?" అడిగాడు లాక్.

"నేను కాదు!"

లాక్ అతడిని యీడ్చిపెట్టి తన్నాడు. రాములు బోర్లగిలపడి కిటికీ దగ్గర ఆగాడు. పెదిమలూ, మోచేతులూ చురచురమంటున్నాయి. బాండ్ అతడిని లేవనెత్తాడు. మైక్ అతడి నోటిముందు పెట్టాడు.

రాములు మాట్లాడబోయాడు. కిటికీ అవతల ఎవరో కదిలారు. బాండ్ చటుక్కున రాములును యివతలకు లాగబోయాడు. అప్పటికే కిటికీ చువ్వల మధ్య పిస్తోలు ప్రత్యక్షమయింది. పిస్తోలూ పిస్తోలును పట్టుకున్న చెయ్యి మాత్రమే కనిపిస్తోన్నాయి. ఆ వ్యక్తి కిటికీ చాటున

నిలబడ్డాడు. లాక్ పిల్లిలాగా కదిలాడు.

ట్రిగ్గర్ మీద అతడి వ్రేలు బిగుసుకుంటోంది.

రాములును ప్రక్కకు లాగాడు బాండ్. అదే క్షణంలో పిస్తోలు ప్రేలింది. మరుక్షణంలో అతడి చెయ్యి కిటికీ వూచల మధ్యకు జారింది. పిస్తోలు పట్టుకున్నవాడి తల చువ్వలకు తాకింది. అతడు వెనక్కి తిరగబోయాడు. లాక్ అతడి వెనుక నిలబడి మరల తన్నాడు.

బాండ్‌కి పిస్తోలు పట్టుకున్న చెయ్యి అందింది. చెట్టు కొమ్మను వెనక్కి వంచినట్టు చేతిని వంచి బలంగా వెనక్కి విరిచాడు.

లాక్ అతడి తల పట్టుకుని వంచి బలంగా డొక్కలో కుమ్మాడు. మురారి వెల్లకితలా పడ్డాడు. పడినవాడు మెలక తిరిగాడు. బోర్లగిల మూడంకె వేసి అలాగే వుండిపోయాడు.

“మురారీ! నువు సోములును ఎందుకు చంపావు?” లాక్ అతడిని మరల ఫెడీమని తన్నాడు.

మురారి భళ్ళున వాంతి చేసుకున్నాడు. నేలమీద రక్తం కెరడుపడింది. పెదిమలు తుడుచుకుని, “వాడు సుందరికి మామీద అసహ్యం పుట్టించాలని చూశాడు. నేను దొంగనోట్లు ముద్రణలో సతమతమవుతోన్నాను. తోటమాలి రాములు నాకు సహాయకారి. రాములును కూడా తన గుప్పెట్లోకి తీసుకుని ఆడించాలనుకున్నాడు. సుందరి యింట్లో నా అనుమతి లేకుండా దొంగనోట్ల కట్టలు వుంచి అసలు నోట్లు ఎత్తుకుపోయాడు. అతడిని వదిలిపెట్టడం నాకు చేతకాలేదు. లక్ష్మి సహాయంతో చంపేశాను. అని చూసిన సీత బెదిరిపోయింది. రాములు

చేత ఆమెను చంపించాను” అన్నాడు.

పోర్టికోలో పోలీస్ జీపు ఆగింది. జీపులో లక్ష్మి వుంది. ఆమెకు తోడుగా మురారి, రాములూ జీపులో కూర్చున్నారు.

జీపు కదిలింది.

“పద! బాండ్! సుందరికి విషయం చెప్పి, మన ఫీజు ఖనూలు చేసుకుందాం!” అన్నాడు లాక్ కళ్ళుమూసుకుని.

బాండ్ అతడి కనురెప్పలు పట్టుకు లాగాడు. లాక్ నిశ్చలంగా కళ్ళు మూసుకునే వున్నాడు.

—:ఐ పో యిం ది:—